రబీ సాగుకు మెట్ట రైతు సన్నద్ధం


మెట్టలో రబీ సాగుకు దుక్కులు చేస్తున్న రైతులు


మెట్టలో రబీ నారుమడులు వేసిన దృశ్యం

- నబ్ డివిజన్‌లో 8,228 ఎకరాల్లో సాగుకు సన్నాహాలు
- నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు

చింతలపూడి: ఖరీఫ్ వ్యవసాయం ముగిసింది. జిల్లాలో మెట్ట రైతాంగం ఇప్పుడు రబీ సాగులో ముమ్మరంగా నిమగ్నమై ఉన్నారు. అయినా ఖరీఫ్ పంట ఇంకా పూర్తి స్థాయిలో కొనుగోళ్లు పూర్తి కాలేదు. దళారుల ప్రమేయంతో ధాన్యం కొనుగోళ్లు అలస్యమవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ వరి కోతలు పూర్తయినా పొలాల్లో ఇంకా నీటితడులు తగ్గలేదు. దీంతో అదును పోతుందని భయపడి రబీ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో 8,228 ఎకరాల్లో రబీ వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. వరి కాక 24,152 ఎకరాల్లో మొక్కజొన్న, 2,826 ఎకరాల్లో పొగాకు, 811 ఎకరాల్లో వేరుశనగ పండించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం రబీ నారుమడులు పోయడంలో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఇవి కాక మిర్చి, పెసలు, మినుములు, పొద్దు తిరుగుడు పంటలను రబీలో సాగు చేస్తున్నారు. వచ్చే నెలాఖరులోగా వరినాట్లు పూర్తవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

కలుపు నివారణతో అధిక దిగుబడులు

ప్రస్తుతం మొక్కజొన్న రెండు వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఈ దశలో మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయాధికారులు అన్నారు. కలుపు నివారణకు యట్రజిన్ మందును ఎకరాకు కేజీన్నర చొప్పున నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే చలికాలం కావడంతో వరిలో జింక్ లోపం తలెత్తే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి జింక్ నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆరుతడి పంటలు మేలు



భూగర్భ జలాలు ఈ ఏడాది పెరిగాయి. నీటిని ఆదా చేసుకుని మెట్టలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవడం మేలు. మార్చి వచ్చే సరికి చెరువుల్లో నీరు తగ్గిపోయి సాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. తాగునీటితో పాటు, పశువులకు కూడా నీరు దొరక్క ఇబ్బందులు కలుగుతాయి. ఈ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు వేసుకోవడం వల్ల నష్టం ఉండదు. రైతులు వరికి బదులు మొక్కజొన్న, వేరుశనగతో పాటు అపరాల సాగుకు ప్రాధాన్యమివ్వాలి.

బి.నాగకుమార్, ఏడీఏ వ్యవసాయ శాఖ, చింతలపూడి సబ్‌డివిజన్

క్లుప్తంగా

పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో దల్లి మోహన్‌రెడ్డి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు దల్లి మోహన్‌రెడ్డి ఆదివారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని, కష్టపడి పని చేసే వారికి మంచి గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు మోహన్‌రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వైఫల్యాలపై ప్రశ్నించాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారని మోహన్‌రెడ్డి అన్నారు.

నూకాలమ్మను దర్శించుకున్న విద్యార్థులు


నూకాలమ్మను దర్శించుకుంటున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ దేవస్థానంలో నిత్య పూజా కైంకర్యాలు, సాయం సంధ్యా హారతి పూజలు అర్చకులు నిర్వహించారు. గీతా జయంతిని పురస్కరించుకొని, టీటీడీ అధ్వర్యంలో జిల్లా స్థాయి భగవద్గీత ఆరో అధ్యాయంపై నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొనేందుకు వస్తున్న బుట్టాయగూడెం విద్యారోహిణి విద్యార్థినీ, విద్యార్థులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 14వ తేదీన 70వ చండీహోమం ఆలయంలో నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో విద్యారోహిణి విద్యాసంస్థ అధినేత రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు


ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న కిమ్స్ సిబ్బంది

కుక్కునూరు: పొంగులేటి స్వరాజ్యం, రాఘవ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం కిమ్స్ మల్టీ స్పెషాలిటీ డాక్టర్లచే ఆదివారం కుక్కునూరు శ్లోక కాన్సెప్ట్ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి డాక్టర్లు షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మారుమూల ప్రాంతాల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ భీమ్‌రెడ్డి, బాబు రెడ్డి, చావా శివరామకృష్ణ, హాస్పటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి శాశ్వత అన్నప్రసాద ట్రస్టుకు ఒక భక్తురాలు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. జంగారెడ్డిగూడేనికి చెందిన నిడమర్తి నాగ విజయలక్ష్మి ముందుగా స్వామి వారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

పది నుంచి రెవెన్యూ సదస్సులు

భీమడోలు: మండలంలోని ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి ఆదివారం కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయని తెలిపారు. ఈనెల 10వ తేదీ మంగళవారం పూళ్ల, 12న గుండుగొలను, 16న అంబర్‌పేట, 18న భీమడోలు, 20న చెట్టున్నపాడు, మల్లవరం, 23న ఆగడాలలంక, 26న పోలసానిపల్లి, 28న సూరప్పగూడెం, 30న దుద్దేపూడి, కోడూరుపాడులో రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తామన్నారు. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జంగారెడ్డిగూడెం: జేపీ యూత్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడు షేక్ ముస్తఫా అధ్యక్షతన ఆదివారం జయప్రకాష్ నారాయణ యూత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జంగారెడ్డిగూడెం జేపీ యూత్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీని యూత్ సీనియర్ సభ్యులు మల్లవరపు సత్యనారాయణ ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్ ముస్తఫా, అధ్యక్షుడిగా పాదిలి ఫణీశ్వర్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా వేములపూడి నాగరాజు, తదితరులు ఎన్నికయ్యారు.

వంద లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

వేలేరుపాడు: జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో వేలేరుపాడు మండలం రేపాకగొమ్ము గ్రామంలో ఆదివారం ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. గ్రామంలో వంద లీటర్ల బెల్లం ఊట, పది లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఒక లీటర్ నాటు సారా కలిగిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు, ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ


వర్సా భాస్కర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కుక్కునూరు: అనారోగ్యంతో చికిత్స పొందుతూ కోలుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆదివారం పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. మండలంలోని గొమ్ముగూడెం గ్రామ కన్వీనర్ దేవర సత్యనారాయణ ఇటీవల విషజ్వరం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. నెమలిపేట గ్రామానికి చెందిన వర్సా భాస్కర్ ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో చికిత్స తీసుకోని కోలుకున్నాడు. వీరిద్దరిని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరంలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. లక్కవరం స్టేషన్ పరిధిలో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే డయల్ 112, లక్కవరం ఎస్సై నెంబర్ 94407 96629కు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

గడ్డి వాము దగ్ధం

దెందులూరు: చల్లచింతలపూడిలో గుర్తు తెలియని వ్యక్తులు సుంకవల్లి రవికి సంబంధించి గడ్డివామును దగ్ధం చేశారని ఎస్సై ఆర్.శివాజీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సుంకవల్లి రవికి చెందిన 5 ఎకరాలకు సంబంధించిన గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారని దీనిపై రైతు ఫిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు.

మహా సభలను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కుక్కునూరు: ఈ నెల పదో తేదిన వేలేరుపాడు సిద్దార్థ డిగ్రీ కళాశాలలో పోలవరం ప్రాజెక్ట్ ఏడు ముంపు మండలాల నిర్వాసితులతో నిర్వహించే మహా సభలకు ఏడు మండలాల నిర్వాసితులు భారీగా తరలిరావాలని సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణంతో సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులను ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని విమర్శించారు. సర్వేల సాకుతో పరిహారం ఇవ్వకుండా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

కొయ్యలగూడెం: సీపీఎం జిల్లా 26వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు ఆదివారం పిలుపునిచ్చారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. 13న భారీ ప్రదర్శన బహిరంగ సభ నిర్వహిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం ముఖ్య నాయకులు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

మహిళలపై హింసను అరికట్టాలి


సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లు

జంగారెడ్డిగూడెం: మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ అనుబంధ జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. తీయ్యల గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ ఇటీవల మహిళలపై అత్యాచారాలు, హత్యలు, లైంగిక వేధింపులు, గృహ హింసలు తీవ్రంగా పెరిగాయన్నారు. సోమవారం కడపలో ప్రేమించలేదనే కారణంతో ఒక ఉన్మాది బాలికపై 13 కత్తి పోట్లు పొడిచాడని ఇటువంటి ఘటనలను తక్షణం అరికట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలిన ధర్మరాజు, కోట శివకృష్ణ, వనపర్ల నవీన్, పుచ్చల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


సీతాసమేత కోదండరాముడి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని ముప్పినవారిగూడెంలో సీతాసమేత కోదండ రామచంద్రమూర్తి దేవాలయంలో ఆదివారం ఘనంగా విగ్రహ పునః ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, కుంభార్చనం, ఉక్తహోమం, మూలమంత్ర హోమాలు రత్నన్యాసం, ధాతున్యాసం, సుముహూర్త కాలేయంత్ర-ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనం, మహాపూర్ణాహుతి, కుంభకళాన్యాసం, కుంభాభిషేకం, ప్రథమార్చనం, తదితర పూజా కార్యక్రమాలు వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం సీతాసమేత కోదండ రామచంద్రమూర్తి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సింహాద్రి వీరభద్రరావు, ఆంద్రు సత్తిబాబు, కాకర్ల మురళీ నాగప్రసాద్, తాళ్లూరి ప్రసాద్, నందిన సతీష్, పల్లోతు శివ నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు


ఎమ్మెల్యే బాలరాజును సత్కరించిన పాలకవర్గం

కొయ్యలగూడెం: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలలో భాగంగా ఆదివారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధిగాంచిన బయ్యనగూడెంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు కొత్తలంక ప్రసాదాచార్యులు బాలరాజు చేత విశేష పూజలు చేయించారు. అనంతరం పాలకమండలి ధర్మకర్త బాలం దత్తుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు. మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దు బాల నాగేశ్వరరావు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, తేజ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనాగరికం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

ఉంగుటూరు: బాల్య వివాహాలు అనాగరికమైన విధానమని, వాటిని అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని కమిటీ సభ్యులు అల్లు శ్రీను అన్నారు. ఆదివారం ఉప్పాకపాడులో బాల్యవివాహాల వల్ల సమాజానికి, వ్యక్తిగత ఆరోగ్యానికి కలిగే అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో అల్లు శ్రీను మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల మహిళల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. బాలబాలికలను చదివించడం తల్లిదండ్రుల బాధ్యతగా గుర్తించాలన్నారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు, మగపిల్లలకు 25 ఏళ్లు వచ్చిన తరువాత వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికడతామని తల్లిదండ్రులు, బాలబాలికలు, అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నక్క సుధాకర్, ... ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్లు సుబ్బలక్ష్మి, జాన్సీ, ఆశావర్కర్లు నిర్మలా, మణి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల రవాణాపై కేసు

భీమడోలు: కోళ్ల వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను ఆదివారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తితే.. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన జల్లూరి సుబ్బరాజు అనే వ్యక్తి తన సొంత వ్యాన్‌లో రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో సేకరించిన 1.5 టన్నుల కోళ్ల వ్యర్థాలను తోకలపల్లిలోని తన ఆక్వా చెర్వులకు మేతగా వేసుకునేందుకు తీసుకువెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

కొనసాగుతున్న వంతెన పనులు

- సిమెంట్ తూరల స్థానంలో భారీ ఐరన్ తూరలు ఏర్పాటు
- వంతెన నిర్మాణ ప్రాంతంలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు


గుండుగొలను వద్ద సాగుతున్న వంతెన పనులు


వంతెన నిర్మాణ ప్రాంతంలో పేరుకుపోయిన తూడు

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న గుండుగొలను వద్ద గోదావరి కాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులకు ఆటంకాలు తొలగిపోయాయి. రైతులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వంతెన నిర్మించాలన్న నిర్ణయంతో పనులకు సందిగ్ధం వీడింది. దీనితో పనులు యథావిధిగా సాగుతున్నాయి. పంట పొలాలకు సాగు నీరు లేక ఇబ్బందులు పడతామని, ఇప్పటికే కాలువలో నీటి ప్రవాహం తగ్గిందని దాళ్వా సీజన్ పూర్తయిన తర్వాత పనులు చేపట్టాలని దెందులూరు మండలంలోని శివారు ప్రాంతాల రైతులు వంతెన నిర్మాణ పనులకు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనితో పనులపై ప్రభావం పడింది. శివారు రైతులకు, గుండుగొలను, వివిధ గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారధి నిర్మాణ పనులు సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. సిమెంట్ తూరల స్థానంలో ఐరన్ తూరలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి పనులు ప్రారంభించారు.

కాంట్రాక్టర్, అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

రెండేళ్ల క్రితం గుండుగొలను వద్ద గోదావరి కాలువపై బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెన కూలిపోయింది. అయితే పలు మండలాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, రైతులు, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కృషి ఫలితంగా ప్రభుత్వ నిధులతో తక్షణమే బెయిలీ వంతెనను నిర్మించారు. దీనితో ఆగిపోకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను పుప్పాల వాసుబాబు తీసుకుని వెళ్లి వంతెన నిర్మాణానికి రూ.4 కోట్ల మేర నిధులు మంజూరు చేయించారు. పనులకు నిధులు ఆటంకం లేదు. కాంట్రాక్టర్, జలవనరుల శాఖ అధికారుల మధ్య తొలి నుంచి సమన్వయం కొరవడింది. సాగు నీటి ప్రవాహం సాకుతో రెండు సీజన్ల పాటు పనులు పూర్తిస్థాయిలో చేపట్టిన దాఖలాల్లేవు.

ప్రజల ఆందోళనతో దిగి వచ్చిన అధికారులు

ఇటీవల గ్రామస్తుల ఆందోళనతో దిగిన వచ్చిన అధికారులు కాలువ ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేలా పోలవరం నుంచి 3 మీటర్ల గల భారీ తూరలను తీసుకుని వచ్చారు. ఇటీవల వంతెన పనులు పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆ తర్వాత ఈ ఐరన్ తూరలు వేస్తే కాలువలోని జారుడు మట్టి వల్ల తూరలు ఏర్పాటు చేస్తే గతి తప్పి నిర్మాణం కష్టంగా ఉంటుందని భావించిన సంబంధిత అధికారులు వాటి స్థానంలో సిమెంట్ తూరలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.విషయం తెలుసుకున్న దెందులూరు మండలంలోని సత్యనారాయణ, పాలగూడెం, కొవ్వలి, ఉండ్రాజవరంలోని రైతులు వంతెన నిర్మాణ పనుల వద్ద సిమెంట్ తూరల ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే తాము నారుమడులు వేసుకున్నామని, దీంతో పొలాలకు సాగు నీరు చేరకుంటే తీవ్ర ఇబ్బందులు పడతామని జలవనరుల ఉన్నతాధికారులు తమ సమస్యను తెలియజేసి అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్, ఇతర నాయకులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. దీనితో నిర్మాణ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శనివారం రాత్రి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్, నాయకులతో చర్చించి అందరికీ ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టేలా భారీగా ఉన్న ఐరన్ తూరలు పెట్టాలని వారిని ఆదేశించారు. దీనితో పనులు కొనసాగుతున్నాయి.

రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలి

పెదవేగి : దేశవ్యాప్తంగా న్యాయవాదులంతా భారత రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలని ఆర్సియం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఉద్బోధించారు. ఆదివారం ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాలలో కథోలిక న్యాయవాదుల ముగింపు సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ న్యాయవాదులంతా నిబద్ధత కలిగి ఉండాలని శాంతి, న్యాయం కోసం అహర్నిశలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. న్యాయవాదులు రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకొని దేశవ్యాప్తంగా సదస్సులు సమావేశాలు ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని ఇనుమడింప చేయాలన్నారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా హాజరైన 130 మంది న్యాయవాదులు, సిస్టర్లు, జడ్జిలు సుపీరియర్లకు పీఆర్వో ఫాదర్ టి ఇమ్మానుయేల్ నిర్వహణ బృందం ఫాదర్లు కృతజ్ఞతలు తెలిపారు.

5కే రన్‌లో యశోదకృష్ణకు ప్రథమస్థానం


5కే రన్‌లో పాల్గొన్నగణపవరం విద్యార్థులు

గణపవరం: పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఆదివారం నిర్వహించిన 5కే రన్ పరుగు పందె పోటీలో గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన యశోదకృష్ణ పాల్గొని ప్రథమస్థానం సాధించినట్లు పీడీ పద్మావతి తెలిపారు. గణపవరం బాలుర ఉన్నత పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు పోటీలకు హాజరుకాగా వీరిలో యశోదకృష్ణ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు సాయన్నపాలెంలోని కొల్లేరు భూముల్లో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడి చేసారు. కోడి పందేలు ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసారు. వారి నుంచి రూ.2,100 నగదు, ఒక కోడి, రెండు కోడి కత్తులను పోలీసులు సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

నేడు రాట్నాలమ్మ హుండీ లెక్కింపు

పెదవేగి : రాట్నాలమ్మవారి దేవస్థానం తాలూకా హుండీలు సోమవారం లెక్కిస్తామని ఆలయ దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఆలయ ముఖ మండపం వద్ద హుండీలు లెక్కిస్తామని ఈఓ తెలిపారు.